# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సేవలను మరింత వినియోగించుకోనున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2.** **తెలంగాణలో ఈనెల 26వ తేదీ నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయనున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు**

**3.** **గిరిజనుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.**

**4.** **సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణలో నడిపే ప్రత్యేక బస్సులలోనూ మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.**

**5.** **తొలితరం స్వాతంత్ర్య యోధులు వడ్డే ఓబన్న జయంతి ఈ రోజు.**

==========================

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను హేతుబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గ్రామ, వార్డు సచివాలయాలశాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రతిపాదించిన ప్రకారం 1.61 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు గానూ 1.27 లక్షల మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. కొత్త విధానం వల్ల తక్కువ సంఖ్యతో ఎక్కువ సేవలు పొందే అవకాశం ఉందని, ఉన్న వారిని సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. అలాగే 2 వేల 500 మంది జనాభాకు లేదా 5 కి.మీ పరిధిలో ఒక సచివాలయం ఉండేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

--------------------------

తెలంగాణలో ఈనెల 26 వ తేదీ నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయనున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు హైదరాబాద్ లో జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, నగరాల్లో వార్డు సభలు నిర్వహించాలని..కలెక్టర్లను ఆదేశించారు. అర్హులైన వారందరికీ

రైతు భరోసాను అందించాలని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అనర్హులను గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

హైదరాబాద్‌లో నిర్మించనున్న ఫోర్త్ సిటీని కాలుష్య రహితంగా ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దనున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని సీఐఐ గ్రీన్ వాణిజ్య కేంద్రంలో నిర్వహించిన సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో భవిష్యత్తునగరాన్ని నిర్మించనున్నామని చెప్పారు. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ... 33 సెకన్లు

---------------------------

రాబోయే రెండేళ్లలో 50 అమృత్ భారత్ రైళ్లను తయారు చేయనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. తమిళనాడులోని చెన్నైలో ఇంటిగ్రల్ కోచ్ కర్మాగారాన్ని నిన్న సందర్శించి అమృత్ భారత్ రైళ్లతో పాటు, వందేభారత్ 2.0 స్లీపర్ రైళ్ల తయారీని మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అమృత్‌భారత్ రైళ్లలో కొత్తగా 12 రకాల మార్పులు చేపట్టినట్లు తెలిపారు. దేశంలోని పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన రవాణా సౌకర్యమే లక్ష్యంగా ఈ రైళ్లను తీసుకొచ్చామని అన్నారు. తక్కువ ఖర్చుతో దూర ప్రాంతాలకు వెళ్లే వారికి మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి వివరించారు.

---------------------------

గిరిజనుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ యోజన పథకంలో భాగంగా ప్రకాశం జిల్లా దోర్నాల లోని మల్లికార్జునపురం ఎస్టీ కాలనీలో విద్యుత్ సౌకర్యాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో ఒక వెయ్యి 750కు పైగా చెంచు గిరిజన కుటుంబాలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. వ్యవసాయం చేసే చెంచుల కోసం వారి పొలాల్లో సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణలో నడిపే ప్రత్యేక బస్సులలోనూ మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, సంక్రాంతి పండుగకు 6432 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి బస్ స్టేషన్ దగ్గర ప్రత్యేక అధికారులను నియమించి ప్రయాణికులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ సంస్థలు నడిపే బస్సులలో ప్రస్తుతం ఉన్న చార్జీలనే వసూలు చేయాలన్నారు. అదనపు చార్జీలను వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా త్వరలోనే నైపుణ్య గణనను ప్రారంభించనున్నామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టనున్న నైపుణ్య గణన విధివిధానాలపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుంటూరు జిల్లా మంగళగిరిలో చేపట్టిన నైపుణ్యగణనను పరిగణనలోకి తీసుకొని మరింత సులభతరంగా రాష్ట్రవ్యాప్తంగా గణన చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన సమాచారం యువతకు భవిష్యత్తులోనూ ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు.

---------------------------

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం కంటె ముందే దక్షిణ భారత దేశంలో బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధులు వడ్డే ఓబన్న జయంతి ఈ రోజు. ఓబన్న కర్నూలు జిల్లాలోని రేనాటి ప్రాంతంలో 1807 జనవరి 11న జన్మించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షులుగా ఓబన్న ముఖ్య పాత్రను పోషించారు. 10 వేల మందితో సంచార తెగల సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బ్రిటిష్ సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆయన చేసిన పోరాటం గురించి తెలియజేసేందుకు వడ్డే ఓబన్న జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది. కాగా గుంటూరులో ఈ రోజు జరిగే వడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతి వేడుకల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత పాల్గొంటారు.

---------------------------

పేదరిక నిర్మూలన కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిన్న జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో 15 శాఖలలో కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా అమలవుతున్న 44 పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్యం, సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు.

---------------------------

వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనకు భక్తులందరికి క్షమాపణలు చెబుతున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలోని అన్నమయ్య భవన్‌లో టిటిడి పాలక మండలి నిన్న సమావేశమైంది. అనంతరం బీఆర్ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్...22 సెకన్లు

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తెలంగాణలోనూ చలి గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=======================